ఆగి ఆగకుండానే దాదాపు పదిమంది కుర్రాళ్ళు లోపలికి పరుగెత్తు కొచ్చారు.

"కంగ్రాట్స్ యుహేవ్ డనిట్" అని అంటూ సందీప్‌ని చుట్టు ముట్టారు. అతనితో కరచాలనం చేసారు.

సందీప్ గర్వంగా నవ్వి లేచి నిలబడ్డాడు.

"ఏమిటీ గొడవ" అడిగాడు ముసలాయన వాళ్ళలో ఒకరిని.

"వరంగల్‌లో బయలుదేరిన కృష్ణా ఎక్స్‌ప్రెస్ పావుగంటలో కాజీపేట వచ్చేస్తుంది కాని అరగంటలోగా అది ఇవాళ రాదని పందెం వేసాం మేం ఇంజనీరింగ్ కాలేజిలో మూడో సంవత్సరం చదువుతున్నాం ఫైనల్ ఇయర్ విద్యార్థులతో పందెం వేసుకున్నాం" ఆనందంగా చెప్పాడు ఓ విద్యార్థి ఆ ముసలాయనతో.

"ఎంతకీ పందెం ?" పెగుల్చుకొని అడిగాడు ముసలాయన.

"మా అందరికీ తలో బీర్ బాటిల్ ప్లస్ ఆరు వందల నలభై అయిదు రూపాయలు."

"ఇరు పక్షాలలో వరంగల్ రైలు బయలుదేరిన టైం ఒకరు నోట్ చేసుకుంటే ఇక్కడికి వచ్చిన టైం మరొకరు నోట్ చేసుకున్నాం.

"మేమే గెలిచాం. చెయిన్ లాగి రైలు ఆపుతానని చెప్పాడు సందీప్ నిన్నంతా ఆలోచించి."

సందీప్ ఆ అమ్మాయిల వంక చూడనయిన చూడకుండా బయటికి నడిచాడు.

ఆ ఎనభై రెండు రూపాయలు సందీప్ వ్యక్తిగతంగా గెలుచుకున్న పందెం అనీ, అతడు కట్టిన రెండువందల ఏభై రూపాయలు ఫైన్ వాళ్ళు గెలుచుకున్న పందెం డబ్బులోంచి తీసేసి. మిగతాది అంతా పంచుకుంటారని అట్టే ఆలోచించకుండానే పందెంలో ఓడిపోయిన ఆ ఏడుగురితో పాటు మిగతా ప్రయాణీకు లందరికీ అర్థమైపోయింది.

(జ్యోతి మంత్లి డిసెంబర్ 1982)